

పుచ్చపువ్వులాంటి వెన్నెలను విరజిమ్ము తున్న చందమామతో దోబూచులాడు కుంటున్న పిల్లమబ్బుల్నీ; చందమామ చల్లదనానికి మత్తెక్కి, మైమరచి పోయి నట్లుగా ఎగిరెగిరిపడుతున్న సముద్ర కెర టాలనూ; ప్రపంచాన్ని పారా కాస్తున్న ట్లుగా నిర్విరామంగా తిరుగుతున్న లైట్ హౌస్ తాలూకు కాంతినీ; దూరంగా సముద్రంలో మినుకుమినుకు మంటున్న దీపాలతో తేలియాడుతున్న ఓడలనూ; పామ్‌బీచ్ వైపునుండి ప్రసరిస్తున్న 'ఈస్ట్ పాయింట్ లైట్‌హౌస్' ఎర్రటి కిరణా లనూ చూస్తూ పరధ్యానంగా నిలబడిన సుందరి– "ఏవిటి సుందూ, అలా తదేకంగా ఆలోచిస్తున్నావ్?" అన్న భర్త కంఠం విని ఉలిక్కిపడి అతనివైపు తిరిగింది.

"అరె. మీ రొచ్చి ఎంతసేపైంది? ఈ నైట్ సూట్‌తోనే డిన్నర్‌కి వెళ్ళేరేమిటి? ఇంటి సైలెంటుగా రావడం, బట్టలు మార్చేసుకోవడం, చడీచప్పుడూ కాకుండా పైకిరావడం – ఏవిటీ జేమ్స్‌బాండ్ వేషాలూ? రాగానే నన్ను పిలవాలని తెలీదా?"

"ఐ. ఏ. ఎస్. ఆఫీసర్లు మరి అప్పు డప్పుడు జేమ్స్‌బాండ్ వేషాలు వేస్తూ వుండాలి, తెల్సా?" అంటూ చేతిలో మల్లె చెండును సుందరి తలలో తురిమి, ఆమెను హృదయానికి హత్తుకున్నాడు ఆనంద మూర్తి.

తన్మయత్వంలో కళ్ళు మూతలుపడ్డయ్ సుందరికి. "ఇప్పుడూ, ఎప్పుడూ, ఎల్ల ప్పుడూ ఇలానే ఉండిపోనియ్ భగవాన్!" భర్తగుండెల్లో కూరుకుపోతూ దేవుణ్ణి ప్రార్థించుకున్నది సుందరి.

సుందరి మనసులోని ప్రార్థన ఆనంద మూర్తికి ఎలా తెల్సిందో ఏమో, అదే క్షణాన అతను "నో, ఆల్వేస్ అండ్ ఫరె వర్, లెట్ అజ్ బి లైక్ దిస్!" అను కొంటూ సుందరి నొసటిని ముద్దుపెట్టు కొన్నాడు.

చందమామా, చల్లగాలీ, తెల్లమబ్బూ, మల్లెపూలూ; ఆ వాతావరణంలో ఒకరి కొకరు అంకితమైపోయిన సుందరీ, ఆనంద మూర్తీ.

'సుందరి' ఆనందమూర్తి కన్న వేయి కలలపంట! పుట్టుకతోనే ఆమె మీది హక్కును కొనేసుకొన్న ఆనందమూర్తికి– అంటే ఆమెకు 'బావ'గా జన్మించే అదృ ష్టాన్ని పొందిన ఆనందమూర్తికి – పెద్దల మధ్య సాధారణంగా చెలరేగే మనస్పర్థల కారణంగా, ఆమెను తనదానినిగా చేసి కోవడం కొంచెం కష్టమే అయింది. తండ్రి హోదానూ, ఆస్తినీ, ఐ. ఏ. యస్. కు సెలక్టు అవడంద్వారా తాను చూపించు కొన్న ప్రయోజకత్వాన్నీ మిగిలిన యువ కుల కుటుంబ పరిస్థితులతో బేరీజువేసి, ప్రస్తుత సామాజికపరిస్థితుల దృష్ట్యా తన విలువ లక్షన్నర రూపాయల పైచిలుకని అంచనావేసి, జమీందారీ కుటుంబాలకు చెందిన ఏకైక పుత్రికల తల్లిదండ్రుల తాలూకు రాయబారులు తనింటిచుట్టూ తిరగడం, తల్లి కొంతమెత్తబడి 'పరాయి సంబంధమే మంచిది సుమీ' అనే అభిప్రా యాన్ని వెలిబుచ్చి తండ్రిని ఒప్పించ ప్రయత్నించడం, పిల్లల వ్యక్తిత్వానికి విలువ నిచ్చి ఆదరించాలనే సదభిప్రాయం గల తండ్రి "అంతా అబ్బాయి ఇష్టం!" అని వివాహవిషయంలో పూర్తి స్వాతం త్ర్యాన్ని తనకీయడం, తనమనోభీష్టం వెలి బుచ్చగానే నిరుత్సాహపడిన తల్లితో తాను ఘర్షణపడటం, చివరకు తానే జయిం చటం, ఉప్పొంగిపోతూ ఆ విషయాన్ని సుందరికి తెలియజేసినప్పుడు "ఇంకా సంవ త్సరం కష్టపడితే ఎమ్మెస్సీ అయిపోతుంది. అప్పుడుగాని వివాహం విషయం ఆలో చించుకోలేను" అని ముభావంగా సుందరి జవాబీయడం, "పెళ్ళిమూలంగా నీ చదు వుకు ఆటంకం ఏ విధంగానూ రాదు

సుందరీ, నే ట్రైనింగ్‌కి వెళ్ళిపోతా, ఈలోగా నీ చదువు పూర్తయి పోతుంది. ఆ తర్వాతనే నువ్వూ నేనూ భార్యాభర్తలుగా జీవిస్తాం. ఈలోగా 'నువ్వు నా దానివి' - అనే సంతృప్తి నాకుండిపోతుంది సుందరీ!" అని తను నచ్చజెప్పడం, పెద్దలచేత ఒప్పించగల్గటం, ఒకానొక శుభ ముహూర్తాన తానుకన్న బంగారుకలలన్నీ నిజమై సుందరి తన అర్ధాంగి కావడం, తానిచ్చిన మాటప్రకారం వయసుపెట్టే కోరికలకు తాత్కాలికంగా కళ్ళెంవేసి, స్నేహితునిగానే ఆమెనుండి విడిపోయి ట్రైనింగుకు వెళ్ళిపోవడం, ఆ తర్వాత సుమారు రెండుసంవత్సరాల ఎడబాటూ, నరకం - వీటి నన్నిటినీ తల్చుకొన్నప్పుడు ఆనందమూర్తికి "సుందరిని పొందగల్గటం అంత తేలిక కాదుసుమీ!" అన్పిస్తుంటుంది. అలా అన్పించి నప్పుడల్లా ఆమెమీది ప్రేమానురాగాలు పెల్లుబికిపోతుంటయ్. "నాకి హోదా, ఉద్యోగం, పరువూ, పలుకుబడీ ఏమీ వద్దు. ఇరవై నాలుగ్గంటలూ నువ్వే కావాలి!" - అంటూ ఆమెముందు చిన్న పిల్లాడిలా ప్రవర్తిస్తుంటాడు ఆనందమూర్తి. అందుకే రెండేళ్ళ ఎడబాటూ, విరహం తర్వాత భార్యగా ఆమెను చేసుకొన్న క్షణం అతని జీవితంలో మధురాతి మధురమైన ఏకైకక్షణంగా ఎప్పటికీ గుర్తుండి పోతుంది. అందుకే ఆనందమూర్తి సుందరిని ప్రేమిస్తాడు, గౌరవిస్తాడు-భార్యగా, స్నేహితురాలిగా.

"సుందూ, నే నెంతటి అదృష్టవంతుణ్ణో తెల్సా?" సుందరిని తనవైపు త్రిప్పుకొంటూ అన్నాడు ఆనందమూర్తి.

"మీరు కాదు, నేనే అదృష్టవంతురాల్ని! లక్షలకు లక్షలు విలువచేసే మీరు నన్ను కోరి చేసికోవడం నా అదృష్టం కాదూ?" అతని గుండెలమీద వాలిపోయింది సుందరి.

"నిలువెత్తు బంగారం విలువచేసే నీముందు నేనూ, నా కొస్తవనుకొన్న లక్షలూ ఎందుకు పనిచేస్తయ్ సుందూ? నువ్వు చదువుకొనే రోజుల్లో నేలాది యువక హృదయాల్లో చెరని ముద్రలు వేసిన నీ రూపం నా స్వంతం అవడం నా అదృష్టంకాదూ? నీ దర్శనభాగ్యంకోసం క్లాసులు మానుకొని, పడిగాపులు పడి నిల్చొనే కుర్రకారు సంగతి నాకు తెలీ దనుకొన్నావా? నీ చూపుగురించి పరితపించిపోయేవాళ్ళూ, నీ చిరునవ్వుకు ప్రాణాలు సైతం అర్పించేందుకు సిద్ధపడిన వాళ్ళూ - ఎందరో ఉండగా నువ్వు నాకు లభించడం ఏ పూర్వజన్మ సుకృతమో నాకేం తెల్సు? ఔనుగానీ, నిన్ను గాఢంగా ఆ రోజుల్లో ఎంతమంది ప్రేమించేవారో చెప్పవా?"

భర్త ముఖంలోకి కళ్ళు చిట్లించి చూసింది సుందరి. "ఏమిటి మీ రడుగుతున్నది? ఏమైంది మీ కీవేళ? చెప్పండి, ఎందుకు నన్నిలా అడిగారు?" - వణికిన సుందరి కంఠం విని కంగారుపడ్డాడు ఆనందమూర్తి.

"అరె అలాగైపోతూన్నా వేమిటి సుందూ? ఊరికే అడిగా. నిన్ను ఎంతమంది ప్రేమించి డిసప్పాయింటు అయితే నాకు అంతగర్వం! అందుకూ - నే నలా అడిగాను. మరే ఉద్దేశ్యమూ లేదు. ఏమైనా చెప్తే అనుమానాల్ని సృష్టించుకొని కుళ్ళి చచ్చిపోతా ననుకొన్నావా సుందూ? నన్నంత నీచంగా ఊహించావా? ఇదేనా నన్ను నువ్వు ఇన్నాళ్ళూ అర్థంచేసికొన్నది? ఏఅరమరికలూ దాపరికం లేకుండా మనసంతా విప్పి నీ ముందుంచుకుంటాను గదా, నేనేదో అనుకొని పోతానని ఎందుకు నీకీ అనుమానం? చెప్పు సుందూ, నిన్ను అభిమానించి, ప్రేమించి, ఆరాధించేవాళ్ళ సంగతులు చెప్పు - ఆనందంగా వింటాను. విని గర్విస్తాను!"

ఆనందమూర్తి కళ్ళల్లోకి పరీక్షగా చూసి ఒక్క నిట్టూర్పు విడిచింది సుందరి. "నన్ను ప్రేమించినవాళ్ళూ, ఆరాధించిన వాళ్ళూ ఒకళ్ళూ ఇద్దరూ కాదు, ఎంతోమంది!-" ఒక్కక్షణ మాగింది.

"వాళ్ళందరిలోనూ నెంబర్ వన్ గోపాల్ అనే అతనుకదూ?" - ఆనందమూర్తి మాట వింటూనే ఉలిక్కిపడింది సుందరి. ఆమెకళ్ళు వెడల్పయినయ్! ఏదో భయం, అనుమానం ఆ కళ్ళల్లో ప్రస్ఫుటమైనయ్.

"ఏం సుందూ? గోపాల్ అంటే ఎవరో అప్పుడే మర్చిపోయావా?" రెట్టించి అడిగిన ఆనందమూర్తి మనసులో ఏముందో గ్రహించలేక సతమతమై పోయిందిసుందరి.

"నిన్ను అభిమానించి, ప్రేమించి, ఆరాధించి, పూజించుకొన్న ఒకవ్యక్తిని అంతత్వరగా మర్చిపోగలిగేవంటే నిజంగా ఆశ్చర్యమేస్తున్నది సుందరీ!"

భర్త మాటలు వింటున్న సుందరికళ్ళల్లో నీళ్ళుతిరిగినయ్. కన్నీటిపొరల మధ్యనుండి అతనిముఖంలో భావాలను చదివే ప్రయత్నం చేసింది. ఎప్పటిలాగానే చిరునవ్వుచిందిస్తూ "చెప్పు సుందూ, నీబాధలో నన్నూ పాలు పంచుకోనియ్. ప్రేమించడంగాని, ప్రేమలో పడడంకాని క్షమించరాని నేరమేమీకాదు. చదువుకొనేరోజుల్లో ఈసంఘటనలు అతిసామాన్యంగా జరుగుతుంటయ్. వాటిప్రభావం కొన్నిరోజులు, లేక కొన్ని నెలలు అలాగే ఉంటుంది. ఆనక అంతా మామూలే! ఆ మాత్రం నేను అర్థం చేసికోగలను. చెప్పు, నీమనసులోనే దాచుకొన్న బాధ ఏదైనాఉంటే, నాతోచెప్తే నీకు మనసు తేలికపడిపోతుంది. చెప్పు, నీ స్నేహితుడు, నిన్ను పవిత్రంగాపూజించుకొనే స్నేహితుడు - నాకీ విషయం బాగా తెల్సు - అతని గురించి చెప్పు!" అనునయంగా అడిగాడు ఆనందమూర్తి.

"అతను...మీకెలా తెల్సు? ఎందుకు ఈవేళ నన్నిలా పరీక్షిస్తున్నారు? నాకేం తెలియదు. గతాన్నంతా మర్చిపోయేను. ఇంతకీ...అతను...ఆ గోపాల్ మీకెలా తెల్సు? ప్లీజ్, చెప్పరూ?"

"నాకు తెలిసింది ఏమీలేదు సుందూ. గోపాల్ అనే వ్యక్తి నిన్ను గాఢంగా ప్రేమించి, డిసప్పాయింట్ అయ్యేడని మాత్రం నాకు తెలుసు. అంతే! ఇప్పుడు చెప్పు."

"చెప్తా, చాలా రోజులనుంచి అతన్ని గురించి మీతో చెప్పాలనే అనుకొంటున్నాను. సమయం కలిసిరాలేదు. అనుకోకుండా ఇప్పుడు సందర్భం వచ్చింది గనుక అన్నీ చెపుతా -" నంటూ కళ్ళు మూసికొన్నది సుందరి.

* * *

లైబ్రరీలో పుస్తకాలు వెతుక్కుంటున్న సుందరి చెవుల్లో ఇందిర మెల్లగా గొణిగింది- "చూడు, నీ ఎదుటి రేక్‌లో బుక్స్ వెతుకుతున్నతను-" అంటూ.

"ఊఁ, ఎవరతనూ? చాలా సార్లు చూసేను!" మామూలుగానే అడిగింది సుందరి.

"చాలా 'ఏక్టివ్ ఫిగర్'లే! లాస్టియర్ ఢిల్లీనుంచి ఆరతీరావ్ అనే అమ్మాయి వచ్చి ఇక్కడ చదివింది చూడు..."

"ఏమో, ఆవిడెవరో నాకు తెలీదు. లాస్టియర్ నేను లేనుగా!-"

"ఔనౌను. ఆ అమ్మాయీ, ఇతనూ మంచి ఫ్రెండ్స్! చాలా క్లోజ్‌గా మూవయ్యేవాళ్ళు. ఇతను కథలూ, అవీ రాస్తుంటాడు. గొప్ప హ్యూమరస్‌గా ఉంటాయ్‌లే-"

"ఊ హూఁ! పేరేవిటన్నావ్?" ఎదుటి 'రేక్'లోకి పరీక్షగా చూస్తూ అడిగింది సుందరి.

"గోపాల్ అని...." అంటున్న ఇందిర ఎదుటి 'రేక్'లోనుంచి తనవైపే చూసిన 'అతన్ని' చూసి కంగారుపడింది. ఏవీ తెలియనట్టుగా ముఖం ప్రక్కకి తిప్పుకొని పుస్తకాన్వేషణ సాగించింది సుందరి. రెండు నిముషాల తర్వాత వెళ్ళిపోయిన అతన్ని గురించి మరికొంచెం చెప్పింది



ఇందిర. మామూలుగా విని ఊరుకొన్నది సుందరి.

అతను కన్పించినప్పుడల్లా తన ప్రక్కనుండే ప్రతిఅమ్మాయీ అతన్ని గురించి చెప్పడం విని నిజంగానే ఆశ్చర్యపోయింది సుందరి- 'ఇతనింత పాప్యులర్ ఫిగరా!' అని. అతనే ఒకనాడు అనుకోకుండా తనను పలకరించి, "మీస్నేహం కావాలి" అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చినప్పుడు కంగారుపడిపోయింది సుందరి. అయినా తమాయించుకొని, 'స్నేహమా? ఎటువంటి స్నేహం?' అంటూ కనుబొమ లెగురవేసింది.

"స్నేహమంటే 'ఫలానా ఈవిధంగా ఉంటుంది'- అని ఎవరూ డిఫైన్ చేయలేరు మిస్ సుందరీ! ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కవ్యక్తిని చూసినపుడు అనుకోని అభిమానం, ఆత్మీయతా పొడచూపుతుంటయ్. నా అంతట నేను మీవద్దకు వచ్చి మీ స్నేహాన్ని కోరుకోవడం మీకు గర్వకారణమే కావొచ్చు. ఇదే విషయాన్ని మీ స్నేహితులతో చెప్పి మీరు ఎదుటివ్యక్తి సెంటిమెంట్‌ని దెబ్బ తినిపించనూవచ్చు. అంతమాత్రాన మీ దృష్టిలో నేను చులకన ఐపోతాననే బాధ నాకులేదు. మీ స్నేహాన్ని కోరు

కొన్నాను. అభ్యంతరమైతే, వెల్, ఒక అభిమానిగానే ఉండిపోతాను..."

అతనిమాటలు వింటున్న సుందరి కళ్ళు పెద్దవయినయ్. పరీక్షగా అతనివైపు చూస్తూ "అభ్యంతరమని కాదుగాని, ఈ విషయంలో నా ఉద్దేశ్యం తెలిపేముందు నేనుకొంత ఆలోచించుకోవలసివున్నది. అందుకు మీకేం అభ్యంతరం లేదుగా?" అని నవ్వుతూ వెళ్ళిపోయింది సుందరి. ఆ క్షణంనుండి అతనిమాటలు అదేపనిగా గుర్తుకు రాసాగినయ్. దానికితోడు "ఏయ్, అతను ఇందాక నీతోటి ఫలానా చోట ఏవిటి మాట్లాడేడు?" అనీ, "అసలు ఆగోపాల్ నీకెలా తెలుసోయ్? ఇప్పుడేనా లేక ఇంతకుముందే తెల్సా?" అనీ, "ఓహో, ఈయేడు 'టార్జెట్' నువ్వేగామోసు!" ననీ – స్నేహితురాళ్ళు క్షణక్షణానికీ గుచ్చిగుచ్చి ప్రశ్నించడం మూలంగా అతనంటే అదోలాంటిభయం మనసులో గూడుకట్టుకుపోయింది సుందరికి. ఆరోజంతా అదే విషయం మనసులో గిరగిరా తిరిగింది. ఆలోచనలతో సతమతమైపోతూ కళ్ళు మూసుకొన్న సుందరికి "అభిమానించే ఒక వ్యక్తితో స్నేహం చేయడం తప్పేమిటి?" అన్పించింది. "దానికితోడు ఆరతీరావ్‌లాంటి అమ్మాయిలు అతని స్నేహితురాళ్ళుగా చెప్పుకోబడినప్పుడు తనలాంటి మరొకరు ఆ జాబితాలో జేరడం ఏం ప్రమాదం? స్నేహం అంటే స్నేహమే! ఒకరిభావాల నొకరు గౌరవించుకొని, హద్దులు మీరనంతవరకూ స్నేహమనేది ఏ ఇద్దరివ్యక్తుల మధ్యనైనా పెంపొందించుకోవచ్చు"–ననే నిర్ణయానికొచ్చిన సుందరి మర్నాడు అతనివైపు స్నేహపూర్వకంగా చూస్తూ చిరునవ్వు చిందించింది. అదే అతనితో ఆమె స్నేహానికి నాంది. అభిమానం, ఆదరణలతో కూడుకొన్న ఆ స్నేహం ప్రేమ, అనురాగాలతో కూడుకొన్న స్నేహంగా మారిపోయే ప్రమాదమున్నదని స్నేహానుభవం మూలంగా ఊహించగల్గిన సుందరి ఒకనాడు ఆత్మవిమర్శ చేసుకొన్నది–"ఎందుకు తనిలా ఒకవ్యక్తిని దగ్గరకు రానిస్తున్నది? ఈస్నేహం తననీ, అతనినీ ఎక్కడికి తీసుకుపోతుంది? ... నో – అసంభవం! స్నేహం ప్రేమగామారి, ప్రేమ పెళ్ళితో పరిపక్వత చెందే అవకాశం తన విషయంలో లేదు. తన వివాహ విషయంలో అన్ని నిర్ణయాలూ ఇంచుమించు జరిగిపోయినట్లే! వాటిని ఎదిరించి, మార్పించే శక్తి తనకు లేదు. అందుచేత ఈ స్నేహాన్ని కేవలం స్నేహంగానే ఉండనీయాలి. ఈ విషయంలో తనతో సహకరించి, సహాయం చేయమని అతన్నిసారి కోరుకోవాలి!" అనుకొన్న సుందరి మర్నాడు సాయంత్రం కన్పించిన గోపాల్‌తో "నా పరిస్థితి ఇది!" అని అన్నీ విశదంగా చెప్పింది.

"తప్పకుండా సుందరీ! మీ శ్రేయోభిలాషుల్లో మొట్టమొదటివాణ్ణి నేను. ఇన్నాళ్ళూ నా కీ విషయాలు చెప్పలేదేం మీరు?" అంటూ ఆ సాయంత్రానికి రిజర్వు చేసిన సినిమాటిక్కెట్లు చింపివేస్తూ నవ్వేశాడు గోపాల్.

ఆ క్షణంనుండీ తప్పించుకొని దూరదూరంగానే తిరుగుతున్న గోపాల్‌ని చూసి మనసులోనే బాధపడింది సుందరి. రోజు కొకసారైనా ఎక్కడో ఓ చోట కన్పించి, "హాలో" అని పల్కరించే అవకాశమైనా ఈయకుండా తల త్రిప్పుకొని "సీరియస్"గా వెళ్ళిపోయే అతని ప్రవర్తనకు కారణం తనేనన్న సంగతి ఇట్టే గ్రహించగల్గింది. హుషారుగా నవ్వుతూ తుళ్ళుతూ ఉండే గోపాల్ సీరియస్‌గా, రిజర్వ్‌డ్‌గా ఉండడాన్ని గమనిస్తూనే ఉన్న సుందరి అతనిలోని ఈ ఆకస్మిక పరిణామానికి కారణం తనేనని మనసులోనే బాధపడసాగింది. "అయినా తప్పదు, అభిమానాన్ని మనసులోనే దాచుకోవాలి. తన స్నేహం అవతలి వ్యక్తికి సమస్యగా పరిణమించినపుడు ఆ స్నేహానికి విధిగా సంకెళ్ళు వేసుకోవాలి!"– కళ్ళల్లో చిప్పిల్లిన నీటి బిందువులను తుడుచుకొంటూ నిశ్చయించుకొన్నది సుందరి.

* * *

"ఎక్స్‌క్యూజ్ మీ గోపాల్" – సుందరి కంఠం విని వెనక్కు తిరిగిన గోపాల్ చేతికి శుభలేఖ నొకటి అందిస్తూ "తప్పకుండా రావాలి. ఐ విల్ బి ద హేపీయెస్ట్ పెర్సన్ ఇఫ్ యూ కేర్ టు అటెండ్ మై మేరేజ్!" అంటూ చిరునవ్వుతో ఆహ్వానించింది.

ఒక్క క్షణం ఆమె కళ్ళల్లోకి నిశితంగా చూసి, "థేంక్యూ, ఆల్ ద బెస్ట్ టు యూ! కానీ, మిస్ సుందరీ, నే నెలా రాగలను? ఎవరినని చెప్పుకొని రానూ? నిండు హృదయంతో మీరు ఆహ్వానించారు. కానీ పెళ్ళిరోజు మీరు పెళ్ళికుమార్తెగా ఎక్కడో కలలుకంటూ ఉంటారు. మీ స్నేహితునిగా, శ్రేయోభిలాషిగా నన్ను నేను పరిచయం చేసికొంటూ అక్కడకు రావడం సమంజసం కాదు సుందరీ! నేను రాలేను, రాకూడదు; కాని, నా మనసెప్పుడూ మీకు శుభాకాంక్షలు చెపుతూనే ఉంటుంది సుందరీ!" అంటూ తలదించుకొన్న గోపాల్‌వైపు నిస్సహాయంగా చూసింది సుందరి.

అడుగులో అడుగు వేసుకొంటూ మౌనంగా వెళ్ళిపోయాడు గోపాల్. స్నేహితురాళ్ళ పలకరింపులతో అక్కడినుండి కదలింది సుందరి.

* * *

"నే నొచ్చి రెండు నెలలవుతుంది, కనీసం పల్కరించాలనికూడా అన్పించలేదా? మీ గ్రీటింగ్స్‌కు థేంక్స్ చెపుదామన్నా, ముఖం ప్రక్కకి త్రిప్పుకు వెళ్ళిపోతున్నారే, నే నేం తప్పుచేసేను?"– శ్రీమతి సుందరి ఒకనాడు గోపాలాన్ని నిలదీసి ప్రశ్నించింది.

"నిజమే, నాదే తప్పు, క్షమించేయండి!" అంటూ ముందుకు వెళ్ళిపోబోయిన గోపాల్ ఆమె పిలుపువిని ఆగిపోయాడు.

"ఏమైంది మీకు? ఎందుకలా స్నేహితులను చిన్న చూపు చూస్తారు? చెప్పండి గోపాల్, కావాలంటే మంచి మనసుతో మంచి స్నేహితులుగానే విడిపోదాం స్నేహితులుగానే ఒకరినొకరు మర్చిపోదాం. అంతేగాని, ముభావంగా ఉంటూ, ఈ ప్రవర్తనతో నన్ను బాధపెట్టవద్దు-"

"క్షమించండి సుందరీ! నా ప్రవర్తన మీకు బాధ కల్గిస్తుందంటే నాకే ఆశ్చర్యమేస్తుంది. జరిగిన విషయాలను మర్చిపోదామని నా ప్రయత్నం. అందులోనూ మీరు వివాహితులు. నా స్నేహం మూలంగా కలిగే మంచిచెడ్డలను మీకంటే నేనే ఎక్కువగా ఊహించగలను. అందుచేతనే పాత స్నేహాన్నీ, స్నేహితురాలిగా మిమ్మల్నీ మర్చిపోయి, స్నేహానికి బదులు గౌరవ భావాన్ని పెంపొందించుకోవాలని ప్రయత్నిస్తున్నా. ప్రస్తుత పరిస్థితిలో నా స్నేహపునీడ మీకు ప్రమాదకరమైందని నాకు తెల్సు. అందుకే దూరంగా వెళ్ళిపోతున్నా. అపార్థం చేసికొంటే నే నేం చేయగలను?" గోపాల్ కంఠం బొంగురుపోయింది. కళ్ళల్లో నీళ్లు తిరిగాయ్.

చలించిపోయింది సుందరి. "మీరు నన్ను గౌరవించడం నేర్చుకుంటున్నానన్నారు కదూ. నిజంగా గౌరవిస్తే, నా స్నేహానికి విలువిస్తారు. స్నేహితురాలిగా నన్ను ఇప్పటికీ, ఎప్పటికీ గుర్తుంచుకొని అభిమానిస్తారు. అంతేగాని ఇలా ముఖం చాటు చేసికొని తిరగరు. కష్టించినప్పుడు కాస్త పల్కరిస్తేచాలు, అంతకంటే స్నేహితురాలిగా మరేమీ కోరుకోను!" సీరియస్‌గా వెళ్ళిపోతున్న సుందరివైపు చూస్తూ నిల్చుండిపోయాడు గోపాల్.

* * *




హృదయంలో బాధనంతటినీ చెప్పుకొనే గోపాల్‌పై విపరీతమైన అభిమానం, జాలీ కల్గినయ్ సుందరికి. తన మూలంగా ఒక వ్యక్తి మానసికంగా చిత్రవధననుభవిస్తున్నాడనీ, సర్వం మర్చిపోయి తన ఆరాధనలోనే కాలం గడుపుతున్నాడనీ అతని సంభాషణల మూలంగా గ్రహించగల్గిన సుందరి తనను తానే నిందించుకొన్నది. "అతనిని మార్చాలి! మార్చి మళ్ళీ మామూలు మనిషిగా చేయాలి!" అనుకొన్న సుందరి ఆ ప్రయత్నంలో అతనికి మరింత దగ్గరైపోయింది. ఆ రోజు సుందరి వెళ్ళిపోయేరోజు. "నన్నెందుకింత దగ్గరగా రానిచ్చావ్ సుందరీ?" అని అతను కుమిలిపోతూ ప్రశ్నించినపుడు, "ఏమో, నాకేం తెల్సు?" అంటూ కళ్ళుపిండుకొన్నది.

"నిన్ను మర్చిపోవడం ఎలా సుందరీ?" అతని ప్రశ్న.

"నన్ను మర్చిపోతారా? ఎంత అన్యాయం! స్నేహితుల్ని మర్చిపోవడం క్రూరం కాదూ? నేను మీ స్నేహితురాలినేనా?" సమాధాన రూపంలోనే ఆమె ప్రశ్న.

"కాదు. నా స్నేహితురాలివి కాదు. నా సర్వస్వం అంటూ ఏదైనా ఉంటే - అది...సుందరే!" అతని కన్నీరు.

"గోపాల్, వద్దు, అలా భావించవద్దు. ఒక సాధారణమైన స్నేహితురాలిగా భావించండి. అంతే. మరే భావనా వద్దు. ప్లీజ్, అందర్నీ గుర్తుంచుకొని నన్ను...నన్ను...మాత్రం మర్చిపోయినా ఫర్వాలేదు - ప్లీజ్ ఫర్గెట్ మీ -" వణికిపోయిన సుందరి కంఠం.

"మర్చిపోతా సుందరీ మర్చిపోతా. సర్వం మర్చిపోతా. నా సర్వస్వాన్నీ మర్చిపోతా. నన్ను నేనే మర్చిపోతా! అంతా మర్చిపోవాలనే నా ప్రయత్నం. కానీ ఈ బంగారుకలని బ్రతికుండగా ఎలా మర్చిపోను? నా ఈ బంగారుకలే నీకు పీడకల సుందరీ-అందుచేత నాస్నేహాన్నీ, అనుకోకుండా పెరిగిపోయిన ఈ ఆత్మీయతనీ ఓ పీడకలలో సంఘటనలుగా భావించి వెంటనే మర్చిపో సుందరీ! నీ భవిష్యత్ అంతా బంగారుమయం! నువ్వెప్పుడూ సముద్రమంత సంతోషంగా, ఆకాశమంత ఆనందంగా ఉండాలని కోరుకుంటూ, ఆ ఆకాశం, సముద్రం రెండూ కల్సికొనే చోటికి వెళ్ళిపోతా సుందరీ!"

"గోపాల్, ఏవిటి మీరంటున్నది?..." భయంగా సుందరి ప్రశ్న.

"ఔను సుందరీ, నీ సమక్షంలో జీవితం గడపటం అసంభవం. నీ సమక్షంలో

హాయిగా, శాశ్వతంగా కళ్ళుమూసుకొని నిద్రపోవడం ఎంతో సులభం. ఈ రెండు అదృష్టాలలో కనీసం రెండో అదృష్టానికైనా నన్ను నోచుకోనియ్ సుందరీ!"

"నిజంగా మీ రలాగంటే, అలాగే చేసినట్లైతే, నా జీవితంలో ఎప్పుడూ కన్నీరే మిగిల్చిన వారవుతారు గోపాల్. వద్దు. అలాగ ఎప్పుడూ అనవద్దు. మీ రెప్పుడూ హాయిగా ఉండాలి, పూర్వంలా."

"ఊహాకీ, యథార్థానికీ పొత్తుకుదరక, మానసికంగా నరకం అనుభవిస్తూ ఎన్నాళ్లు జీవించను సుందరీ? నీతో ఈ పరిచయాన్ని ఇలా పెంపొందించి, నీ మనసుకు కష్టంకలిగించేలా ప్రవర్తించినందుకు దేవుడు నన్ను శిక్షిస్తాడు. ఒకవేళ దేవుడు లేకపోతే, నన్ను శిక్షించేవాడే లేకపోతే, నన్ను నేనే శిక్షించుకొంటాను సుందరీ! నీ హృదయంలో ఒక స్థానం సంపాదించుకొన్నాననే సంతృప్తితో ఎంతటికష్టాన్నైనా భరిస్తా. ఎటువంటి మృత్యువునైనా ఆనందంగా ఆహ్వానిస్తా! ఈ అదృష్టం, ఈ సంతృప్తీ నాకు చాలు సుందరీ! వీటితోనే బ్రతుకుతా. బ్రతకలేకపోతే వీటితోనే చచ్చిపోతా! నిజంగా నేను బ్రతకలేను సుందరీ! అందుకే... చచ్చిపోతా. నా శ్రేయోభిలాషిగా నన్ను చచ్చిపొమ్మని కోరుకో సుందరీ! ప్లీజ్... లెట్ మీడై..." అశ్రుధారల మధ్య, బొంగురుపోయిన కంఠంతో మాట్లాడిన గోపాల్‌ని చూస్తూ కన్నీరు తుడుచుకొన్నది సుందరి.

అదే కన్నీటి పొరల మధ్యనుండి అస్పష్టంగా-ప్లాట్‌ఫారం మీద అన్నీ పోగొట్టుకొన్న అసహాయునిలా నిల్చున్న గోపాల్ వైపు చూస్తూ, "భగవాన్, ఇతనిని మామూలు మనిషిగా తయారుచేయ్. ఇతనిలో వచ్చిన మార్పుకు నా స్నేహమే కారణమైతే నన్ను కఠినంగా శిక్షించు," అనుకొని కళ్ళు మూసుకొన్నది సుందరి.

రైలు కదలింది. గోపాల్ కోసం సుందరి కళ్లు వెదికినై! పది పదిహేను గజాలు ముందుకు సాగి మళ్ళీ ఆగిపోయింది రైలు. కిటికీలోంచి తల బైటకుపెట్టి గోపాల్ కోసం ప్లాట్‌ఫారం అంతా కలియజూసింది. జన సమ్మర్దంలో కలిసిపోయాడు గామోసు - అతను కన్పించలేదు. అటూ ఇటూ హడావుడిగా పరుగిడుతున్న జనం, హడావుడీ - మరో పది నిముషాలకు కూతకూసి బయల్దేరింది రైలు. కిటికీలోంచి బైటకు చూస్తూ కళ్లు పిండుకొన్నది సుందరి.

* * *

"చూసేవా సుందూ, అతని దృష్టిలో నీ స్నేహానికున్న స్థానం ఎంతటి గొప్పదో? మగవాడు సెంటిమెంట్‌ని ఒక పట్టాన మార్చుకోలేడనడానికి నీ స్నేహితుడు గోపాల్ ఒక ఉదాహరణ. ఆడదాని సెంటిమెంట్‌కీ, మగవాడి సెంటిమెంట్‌కీ ఎంతో తేడా ఉంటుందంటే పూర్వం ఏమో అనుకొనేవాణ్ణి. రోజూ మార్చే చీరల్లాగ సెంటిమెంట్లను మార్చేసుకోగలదు ఆడది. కాని మగవాడి విషయంలో అది సాధ్యంకాదు. సెంటిమెంట్ దెబ్బ తింటే మనిషి సగం నీరైపోతాడు. అతని జీవితపంథాయే మారిపోతుంది. చూడు. ప్రేమ భగ్నమైతే మగవాడు ఆత్మహత్యకు కూడా పాల్పడతాడు. కాని ఆడదో? ఒక రోజు కన్నీరు కార్చి, దేవుడిచ్చిన భర్తతో ఎడ్జస్టయిపోవడం రెండు రోజుల్లో నేర్చేసుకొంటుంది-" ఎటో చూస్తూ చెప్పుకుపోతున్న భర్త వైపు కంగారుపడుతూ చూసింది సుందరి.

"ఏవిటి మీ రంటున్నది? ఇలా చూడండి. అసలు గోపాల్ మీ కెలా తెల్సు? ఇప్పుడు త నెక్కడున్నాడు? ఈ ఊళ్ళోనే ఉంటే - ప్లీజ్ - ఒక్కసారి ఇంటికి ఇన్వైట్ చేద్దాం. చెప్పండి - ప్లీజ్ - గోపాల్ మీ కెలా తెల్సు?..." భర్తను కుదిపివేస్తూ ఆత్రుతగా అడిగింది.

"నువ్వు అతన్ని ఇన్వైటు చేస్తానంటే కాదంటానా సుందరీ! ఎప్పటికీ కాదనను. కానీ, చెప్పేదంతా విను..."

"నే నేమీ వినను. గోపాల్‌ని మనింటికి ఇన్వైటు చేసితీరాలి!" మొండిగా అన్నది సుందరి.

"ఈ సాయంత్రం డిన్నర్ ముందు క్లబ్ ఫంక్షన్‌కి ప్రిసైడ్ చేసే దురదృష్టం నాకు కల్గింది సుందూ! దాన్లో..."

— చెబుతూ ఆగిపోయిన ఆనందమూర్తి ముఖంలోకి తీక్షణంగా చూసి, "చెప్పండి, ఆగిపోయారే?" అన్నదివిసుగ్గా.

"...క్రిందటేడు ట్రైన్ కదులుతుండగా కాలుజారిపడి చనిపోయిన ఒకవ్యక్తి ఆత్మశాంతికి మౌనంగా రెండు నిమిషాలు క్లబ్ ఫంక్షన్‌లో నిల్చోవలసి వచ్చింది. ఆ వ్యక్తి ఆ క్లబ్ మెంబరు అనీ, రైలు కదుల్తుండగా ప్రమాదవశాత్తూ అతను మరణించలేదనీ, కావాలనే ఆత్మహత్య చేసుకొన్నాడనీ, ఆత్మహత్యకు కారణం ఏదో ప్రేమ వ్యవహారమనీ, అతను ప్రేమించిన అమ్మాయి ... సుందరి అనీ, అతను..."

'కెవ్వు'మని అరిచిన సుందరి కేకను విన్పించుకోకుండానే - "అతను గోపాల్ అనీ అతని స్నేహితులు చెప్పేరు!" - అంటూ ముఖం ప్రక్కకి త్రిప్పుకొన్నాడు ఆనందమూర్తి.